క్లుప్తంగా

టీబీ నివారణకు వ్యాక్సిన్ పంపిణీ



మాచర్ల రూరల్: టీబీ నివారణలో భాగంగా గురువారం మండలంలోని రాయవరం గ్రామంలో వ్యాక్సిన్ ప్రక్రియను చేపట్టారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి షుగర్, టీబీ ఉన్నా వ్యాక్సిన్ వేస్తున్నామని హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు తెలిపారు. వ్యాక్సిన్ విషయంలో ఎలాంటి అపోహలు వద్దని అప్పుడే పుట్టిన చిన్న పిల్లల నుంచి 15 సంవత్సరాల వరకు పనిచేస్తుందని, పెద్దలకు కూడా నివారణ ఇస్తుందని చెప్పారు. గతంలో టీబీ సోకిన వారు మూడు నెలల వరకు వ్యాక్సిన్ వేయించుకోవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బి.వి.రావు, అసిస్టెంట్ మురళీధర్, ఏఎన్ఎంలు రాజేశ్వరి, పున్నమ్మ, జయమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన తప్పిపోయిన బాలిక



సత్తెనపల్లి: తప్పిపోయిన బాలికను సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు పట్టణ పోలీసులు గురువారం చేర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో మూడేళ్ల చిన్నారి అటు ఇటు తిరగడాన్ని స్థానికులు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టణ ఏఎస్ఐ సుబ్బారావు బాలికను వెంట బెట్టుకొని పాతబస్టాండ్‌లోని గీతా మల్టీ స్పెషాలిటీ వైద్యశాల వద్దకు తీసుకువెళ్లారు. అయినప్పటికీ ఆచూకీ లభించక విచారించుకుంటూ వెళుతున్న క్రమంలో ఓ పిల్లవాడు గుర్తించి సమాచారం ఇచ్చాడు. కాగా పట్టణంలోని వడ్డవల్లి పశు వైద్యశాల సమీపంలో నివాసం ఉంటున్న తల్లిదండ్రులు డాని, లక్ష్మీలను పిలిపించి బాలిక జ్ఞానసుందరిని అప్పగించారు. చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా పట్టణ ఏఎస్ఐ సుబ్బారావు సూచించారు. తమ బిడ్డను సురక్షితంగా అప్పగించిన ఏఎస్ఐ సుబ్బారావును తల్లిదండ్రులు డాని, లక్ష్మీలతో పాటు పలువురు అభినందించారు.

యువత వివాదాలకు దూరంగా ఉండాలి

బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం, రుద్రవరం, తురకపాలెం గ్రామాల్లో సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో పోలీసు అదనపు బలగాలతో గురువారం కవాతు నిర్వహించారు. ముందుగా గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల రోజు ఎటువంటి ర్యాలీలకు, విజయోత్సవ సంబరాలకు అనుమతి లేదని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు సంయమనం పాటించాలని అన్నారు. ముఖ్యంగా యువత వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో నమోదయ్యే కేసులతో భవిష్యత్తులో ఇబ్బందులు ఉంటాయని సూచించారు. పోలీసుల గస్తీ ఉంటుందని, ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. ఆయా గ్రామాల్లో పోలీసు అదనపు బలగాలతో కవాతు నిర్వహించారు. ఎస్సై పి.హజరతయ్య, ఏఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

యడ్లపాడు: గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తిమ్మాపురం గ్రామ పరిధిలోని బుధవారం రాత్రి అదే గ్రామంలోని ఎస్సీ కాలనీకు చెందిన పుల్లగూర అంజమ్మ(70) గుడారాల పండుగకు వెళ్లేందుకు వాహనం కోసం 16వ నంబర్ జాతీయ రహదారిపైకి వచ్చింది. అదే సమయంలో వేగంగా దూసుకువచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు అక్కడిక్కడే మృతి చెందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధం

- ముందస్తు ప్రణాళికతో పంటల సాగు
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి
- నష్టాలను అధిగమించవచ్చు
- ఏడీఏ జగదీష్‌రెడ్డి



కంభంపాడు గ్రామంలో పొలం దున్నుతున్న రైతు

మాచర్ల రూరల్: ఆరుగాలం శ్రమించే అన్నదాత ముందస్తు ప్రణాళికతో వ్యవసాయాన్ని సాగు చేస్తే అధిక దిగుబడితో పాటు ఖర్చులూ తగ్గించుకోవచ్చునని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుండటంతో పంటల సాగుపై వారు రైతన్నలకు పలు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 12 వేల హెక్టార్లలో పంటలు సాగుకు సన్నద్ధమవుతున్నారు. దీనిలో పత్తి, మిరప, వరి, కంది వంటి పంటలు సాగయ్యే అవకాశముంది. ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే రానున్నట్లు వాతావరణ శాఖాధికారులు తెలియజేయటంతో పాటు అక్కడక్కడ చిరుజల్లులు పడుతుండటంతో రైతన్నలు లోతు దుక్కులు దున్నుతూ సాగుకు సిద్ధమవుతున్నారు.

భూసారాన్ని బట్టి పంటలు వేసుకోవాలి

ఖరీఫ్‌కు ముందే ప్రతి రైతు తమ భూమిలో భూసారాన్ని పరీక్ష చేయించుకుంటే ఎంతో ప్రయోజనకరం. భూసారాన్ని బట్టి అనుకూలమైన పంటలను వ్యవసాయాధికారుల సలహా మేరకు వేసుకోవాలి. దీని వలన రైతులకు పెట్టుబడి తగ్గి దిగుబడి పెరిగే అవకాశముంటుంది. ఎరువులు, యాజమాన్య పద్ధతులు పాటించి, రైతులు అంతర పంటలపై దృష్టి సారించాల్సి ఉంటుంది. ముందస్తు సాగుకు అనుగుణంగా రైతులకు ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలలో పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయాధికారులు అందిస్తున్నారు.

విత్తన శుద్ధితో మంచి దిగుబడి

పంటల సాగులో నాణ్యమైన విత్తన ఎంపికలో విత్తన శుద్ధి కీలకం. పంటల సాగు కోసం రైతులు వివిధ ప్రాంతాల నుంచి విత్తనాలు సేకరిస్తారు. ఈ విత్తనాల ద్వారా పురుగులు పంట మొలకెత్తినప్పుడు ఆశించి నష్టం చేకూరుస్తాయి. విత్తనం ద్వారా వ్యాపించే తెగుళ్లలో మొలక శాతం తగ్గి శిలీంధ్రాల వలన పంట కుళ్లిపోయే పరిస్థితి ఉంది. విత్తన శుద్ధి వలన ప్రారంభ దశలో తెగుళ్ల బారిన పడకుండా ఈ ప్రక్రియ రక్షణ కవచంగా పనిచేస్తుంది. సాగుకు ముందే విత్తన శుద్ధి చేయించుకుంటే మంచి దిగుబడి పొందవచ్చు.

సేంద్రియ ఎరువులతో భూసారం మెరుగు

ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవాలి. ఎక్కువగా రసాయన ఎరువులు వాడటం వలన పంట దిగుబడిలో పలు సమస్యలు ఎదురవుతాయి. పశువుల ఎరువులు వర్మీ కంపోస్టు ఎరువు ద్వారా భూసారం పెరగటంతో పాటు నాణ్యమైన దిగుబడి సాధించవచ్చు. యాజమాన్య పద్ధతులు పాటించి ఎరువులను మోతాదులోనే ఉపయోగించాలి. భాస్వరం ఎరువులను దుక్కిలోనే వేసుకోవాలి. నత్రజని ఎరువులను విడతల వారీగా వేసుకోవాలి. రైతన్నలు యాజమాన్య పద్ధతులను పాటించినట్లయితే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేందుకు దోహదపడుతుందని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు.

> **యాజమాన్య పద్ధతులు పాటించండి**
>
> 
>
> రైతన్నలు యాజమాన్య పద్ధతులు పాటించి ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేస్తే ఎంతో ప్రయోజనకరం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేందుకు భూసారాన్ని బట్టి పంట వేసుకోవాలి. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయించుకోవాలి. సేంద్రియ ఎరువులను వాడాలి. దీని వలన నాణ్యమైన దిగుబడితో పాటు అధిక లాభాలు పొందవచ్చు.
>
> -ఏడీఏ జగదీష్‌రెడ్డి

విలువలు కలిగిన నాయకుడు ముక్కంటి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: విలువలు కలిగిన నాయకుడు మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అకాల మరణం చెందటం బాధాకరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కొమ్ము ముక్కంటి గృహానికి బుధవారం రాత్రి వెళ్లి కొమ్ము ముక్కంటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ మానవతా విలువలు, సమాజ సేవ కలిగిన నాయకుడు కొమ్ము ముక్కంటి అన్నారు. ఓసీ కేటగిరీ మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని కొమ్ము ముక్కంటి సేవా గుణాన్ని గుర్తించి తాను వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించటం జరిగిందని ఈ సందర్భంగా కాసు గుర్తు చేశారు. ఆయన వెంట డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, ఇల్లూరి వెంకయ్య, ప్రేమ్‌కుమార్, మందా సుధీర్, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కామ్రేడ్ వెంకటపతికి నివాళులు



కామ్రేడ్ వెంకటపతి వర్ధంతి నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పిడుగురాళ్ల: కామ్రేడ్ పుతుంబాక వెంకటపతి వర్ధంతిని పట్టణంలోని ప్రజాశక్తి నగర్‌లో ఉన్న కన్నెగంటి హనుమంతు భవనంలో నిర్వహించారు. ముందుగా వెంకటపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ.. పల్నాడు ప్రాంతంలో రైతాంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన యోధుడు వెంకటపతి అని, గిట్టుబాటు ధరల కోసం, సాగర్ నిర్మాణం కోసం రైతాంగాన్ని ఏకం చేసి సత్తెనపల్లి తాలూకాలో 50 వేల మంది రైతులతో సభ నిర్వహించారన్నారు. ఎన్నో పోరాటాలు చేసి పేదలకు 500 ఎకరాల భూమిని పంపిణీ చేశారని తెలిపారు. ఊటుకూరు సర్పంచ్‌గా, ఫిరంగిపురం సమితి ప్రెసిడెంట్‌గా, సత్తెనపల్లి నియోజకవర్గం శాసన సభ్యులుగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఎం సీనియర్ నాయకులు టి.సుబ్బయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తెలగపల్లి శ్రీనివాసరావు, ధీకొండ వెంకటేశ్వర్లు, దేవుళ్ల భూలక్ష్మి, ఎస్‌కే హుస్సేన్, గోవిందు, కోటిరెడ్డి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడే చరిత్ర టీడీపీ నాయకులదే

జాతీయ గిరిజన సంస్థ వ్యవస్థాపకుడు శంకర్ నాయక్

మాచర్ల: రాష్ట్రంలో టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలో అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడడం అత్యంత దారుణమని జాతీయ గిరిజన సంస్థ వ్యవస్థాపకుడు వి.శంకర్ నాయక్ అన్నారు. గురువారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో అత్యంత దారుణంగా పోలింగ్ బూత్‌లను ఆక్రమించి రిగ్గింగ్‌కు పాల్పడిన టీడీపీ నాయకులు, దాడులు చేసి విధ్వంసం సృష్టించారన్నారు. తప్పించుకునేందుకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన నాయకుడిపై దౌర్జన్యానికి పాల్పడిన ఘనత టీడీపీ ఇన్‌చార్జి, ఫ్యాక్షనిస్టు జూలకంటి బ్రహ్మారెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ విప్ పీఆర్కేపై ఇప్పటికీ దుష్ప్రచారం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కౌంటింగ్ రోజున కూడా దౌర్జన్యానికి పాల్పడేందుకు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కొంత మంది పోలీసు అధికారుల సహకారంతో పీఆర్కేను కేసుల్లో ఇరికించి, ప్రజల నుంచి దూరం చేయాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో మరో సారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమన్నారు. టీడీపీ నాయకులకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. ధైర్యం ఉంటే నేరుగా పోటీ చేసి పీఆర్కేపై విజయం సాధించాలని సవాల్ విసిరారు. పల్నాడులో అలజడులు సృష్టించిన చరిత్ర టీడీపీ నాయకులదేనన్నారు. వందలాది మంది కార్యకర్తలపై కేసులు పెట్టించి వారిని జైలుకు పంపించి కౌంటింగ్ రోజు కూడా అక్రమాలకు పాల్పడేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. జూన్ 4న జరిగే కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిసారి చివరి వరకు విజయం మాదే అంటూ ప్రజలను మోసం చేసి ఓట్లు వేయించుకోవాలని చూసినప్పటికీ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు భారీ స్థాయిలో ఓటింగ్‌లో పాల్గొని వైఎస్సార్‌సీపీపై ఉన్న తమ అభిమానాన్ని చాటుకున్నారన్నారు. రాబోవు రోజుల్లో ఇలాంటి దాడులకు పాల్పడిన ప్రతి ఒక్క టీడీపీ నాయకులకు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కేసులపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపి అక్రమ కేసుల్లో ఇరికించిన వారిని వదిలి పెట్టాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజన పథకం పేద విద్యార్థులకు వరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎం.బాల చిన్నమ్మ

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం పేద విద్యార్థులకు ఒక వరమని డాక్టర్ ఎం.బాల చిన్నమ్మ అన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఆదేశాల మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని మొత్తం 36 పాఠశాలలకు చెందిన మధ్యాహ్న భోజన పథకంలో వంట చేస్తున్న వారికి, వారి సహాయకులు 69 మందికి నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య ద్వారానే కుటుంబం, తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, అచ్చు పుస్తకాలు, నోటు బుక్స్‌తో పాటు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించి ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధన చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకంలో వంట చేసేవారికి వంటల పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు కాసు శౌర్రెడ్డి, వీర వెంకట వీరయ్య, సీఆర్పీలు సుమతి, సైదులు, ఎంఆర్సీలు మంగయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైస్ ఎంపీపీ లక్ష్మి మృతి

నరసరావుపేట రూరల్: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అల్లూరివారిపాలెం ఎంపీటీసీ, మండల వైస్ ఎంపీపీ యాంపాటి లక్ష్మి(41) గురువారం మృతి చెందారు. సోమవారం సల్ప అస్వస్థతకు గురైన ఆమెకు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం వైఎస్ ఎంపీపీ లక్ష్మి మృతిచెందారు. మృతదేహాన్ని గురువారం రాత్రి అల్లూరివారిపాలెంలోని స్వగృహానికి తీసుకొచ్చారు. లక్ష్మి మృతదేహానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు. మృతురాలి భర్త వెంకటప్పారెడ్డికి సంతాపం తెలియజేశారు.

నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు



అమరావతి: మండల పరిధిలోని మల్లాది ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం, శనివారం హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త భవిరిశెట్టి హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకుడు పరుచూరి వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 40 అడుగుల అభయాంజనేయ స్వామికి పంచామృత స్నపన, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. శనివారం ధ్యానాంజనేయస్వామి వారికి పంచామృత స్నపన, సహస్ర నామాలతో తమలపాకులతో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు నామ సంకీర్తన, మధ్యాహ్నం 12 గంటలకు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులందరికి అన్న సంతర్పణ చేస్తున్నట్లు తెలిపారు.

లేమల్లెలో...

మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా శనివారం తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కార్యనిర్వాహకుడు వర్ల శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం నిడుముక్కల గ్రామానికి చెందిన పంచముఖ ఆంజనేయస్వామి హనుమాన్ చాలీసా భజన సమాజం వారిచే హనుమాన్‌చాలీసా పారాయణం. ఉదయం 10 గంటలకు బృందావన చెక్క భజన కార్యక్రమం, 11 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభం, సాయంత్రం 6 గంటలకు సాయి సంగీత విభావరి వారిచే అన్నమాచార్య కీర్తనలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఫలితాల అనంతరం సోదర భావంతో మెలగండి

జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్



రాయవరం గ్రామంలో మాట్లాడుతున్న ఆర్వో ఎ.శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్: ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా ప్రజలు సోదర భావంతో మెలిగి ఘర్షణలు, గొడవలకు తావులేకుండా ఐక్యంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాం ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని రాయవరం గ్రామంలో సాయంత్రం పోలీసు కవాతు నిర్వహించి ప్రజలతో ఆయన మాట్లాడారు. ఎన్నికల వరకే పార్టీలనీ, అయిపోయిన తరువాత అందరూ సమానమేనని అభివృద్ధిలో అందరూ చేయి చేయి కలిపి గ్రామాభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ఎవరైనా ఘర్షణలకు, కవ్వింపు చర్యలకు పాల్పడితే వారిపై రౌడీషీటు ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగు తరువాత ప్రజలు పార్టీలకతీతంగా ఎవరి పనులు వారు చేసుకోవాలన్నారు. ఘర్షణల వలన కుటుంబ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతుందని, ఆ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ సురేష్, తహసీల్దార్ మంజునాథ రెడ్డి, ఎస్ఐ కె.రాజశేఖర్, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజల్లో మనోధైర్యం కల్పించేందుకే కవాతు

స్పెషల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు



రెంటచింతలలో కవాతు నిర్వహిస్తున్న స్పెషల్ డీఎస్పీ పి.వెంకటేశ్వర్లు, సీఏఎస్ఎఫ్ దళాలు

రెంటచింతల: ఏ ప్రమాదం వచ్చినా మేము ఉన్నామంటూ ప్రజలలో మనోధైర్యం కల్పించేందుకే ప్రత్యేక బలగాలతో గ్రామ పురవీధులలో ఫ్లాగ్ మార్చ్ (కవాతు) నిర్వహిస్తున్నామని స్పెషల్ డీఎస్పీ పి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని రెంటచింతల, మిట్టగుడిపాడు గ్రామాలలో ప్రత్యేక దళాలు, ఏఆర్ పోలీసు సిబ్బందితో కవాతు (ఫ్లాగ్ మార్చ్) నిర్వహించి అనుమానాస్పద ప్రదేశాలలో, ఇళ్లల్లో, వరిగడ్డి వాములలో, దొడ్లల్లో, పాడు బడిన భవనాలలో, ముళ్లపొదల్లో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం ఆయన గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలకు భద్రతకు భరోసా కల్పించేందుకు, ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాలలో ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా సమస్యాత్మక గ్రామాలలో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణం నెలకొనడానికి ప్రజలందరూ పోలీసులకు పూర్తిగా సహకరించాలన్నారు. ఎన్నికల ఫలితాల సమయంలో హింసాత్మక ఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ఫలితాల సమయంలో ప్రజలందరూ సంబరాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా గ్రామాలలో హడావుడి చేసినా, ప్రజలను ఇబ్బంది పెట్టినా రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



కె.దేవదాసు

నకరికల్లు: మండలంలోని రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు గురువారం తెలిపారు. పిల్లిపెసర, జనుము, జీలుగ విత్తనాలు రైతు భరోసా కేంద్రాలకు చేర్చి పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. విత్తనాల మొలక శాతం పరీక్షించేందుకు నమూనాలు ల్యాబ్‌కు పంపామన్నారు. ల్యాబ్ రిపోర్టులు రాగానే పంపిణీ ప్రారంభిస్తామన్నారు. పిల్లిపెసర 54.8 క్వింటాళ్లు, జనుము 104.4 క్వింటాళ్లు, జీలుగ 114.5 క్వింటాళ్ల చొప్పున విత్తనాలు మండలంలోని రైతు భరోసా కేంద్రాలకు పంపామన్నారు. పిల్లిపెసర కిలో రూ.134, జనుము కిలో రూ.88, జీలుగ కిలో రూ.88 ధర ఉందన్నారు. మార్కెట్ ధరలో 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆదర్శ ఉద్యోగులకు సత్కారం

సత్తెనపల్లి: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి పలువురికి ఆదర్శంగా నిలిచిన ఐదుగురు ఆర్టీసీ ఉద్యోగులను గురువారం ప్రత్యేకించి సత్కరించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు షేక్ కరీముల్లా (726102), జి.గోపి (728453), టార్గెట్ ఎర్నింగ్ పైన అత్యధిక అచీవ్‌మెంట్ చూపిన ముగ్గురు కండక్టర్లు టీపీ శివయ్య (727800), షేక్ షంషుద్దీన్(728906), సీహెచ్ కోటయ్య (727178)లను ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎ సీవీ కుమార్ అధ్వర్యంలో పూలమాలలతో సత్కరించి నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రతి ఉద్యోగి తమ లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఆదర్శ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.